క్లుప్తంగా

ఏలూరు జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్‌గా విజయకృష్ణ


డాక్టర్ విజయకృష్ణ

కామవరపుకోట: ఏలూరు జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్‌గా కామవరపుకోటకు చెందిన వినియోగదారుల రక్షణ చట్టం ప్రచారకులు, డాక్టర్ ఒంటిపల్లి విజయకృష్ణను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఒంటిపల్లి విజయ్ కృష్ణ మాట్లాడుతూ బాధ్యతగా విధులు నిర్వర్తించి వినియోగదారులకు రక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

పంచాయతీ కార్యాలయం తనిఖీ


పరింపూడి పంచాయతీ కార్యాలయంలో డీపీవోకి రాఖీ కడుతున్న సర్పంచ్

కొయ్యలగూడెం: జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ పరింపూడి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది సకాలంలో విధులకు హాజరు అవుతున్నారా లేదా అని స్థానికంగా ఆరాతీశారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, తాగునీరు సరఫరా పరిశీలించారు. ఈ సందర్భంగా రేపల్లెవాడ అవాసంలో తాగునీరు ట్యాంక్ లీకేజీని గుర్తించి సరిచేయమని పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణను ఆదేశించారు. అనంతరం ఈగ్రామ స్వరాజ్ వెండర్ వివరాలు నమోదు చేయించి చెల్లింపులు జరపాలని కొయ్యలగూడెం పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి రక్షాభంధన్ సందర్భంగా రాఖీ కట్టి మిఠాయిలు తినిపించారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి జి.సతీష్, తదితరులు ఉన్నారు.

డీఎంఅండ్‌హెచ్‌వో ఆకస్మిక తనిఖీ


కొయ్యలగూడెం పీహెచ్‌సీలో వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో

కొయ్యలగూడెం: ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డి.ఆశా బుధవారం కొయ్యలగూడెం ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ప్రసవాలు, ఉద్యోగుల హాజరు వివరాలను, ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మందుల వివరాలను ఆసుపత్రి ప్రధాన వైద్యులు బి.ఎస్తేరు రాణిని అడిగి తెలుసుకున్నారు. తనిఖీలో డీఎస్‌వో డాక్టర్ నరేంద్ర కృష్ణ, ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఎం.తస్లీమ్, డెంటిస్ట్ డాక్టర్ శ్రీనివాస్, పీహెచ్‌ఎన్ ఎమ్.సుభద్ర, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం అమలు తీరుని, పరింపూడి-4 సచివాలయాన్ని డీఎంఅండ్‌హెచ్‌వో ఆశా పరిశీలించారు.

డీఈఈ సుబ్బారావుకు అభినందనలు


సుబ్బారావును సన్మానిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం సబ్‌డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యు.సుబ్బారావుకు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సభ్యులు అభినందనలు తెలిపారు. ఆగస్టు 15 వ తేదీన ఏపీ ఈపీడీసీఎల్ ఏలూరు సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ సల్మాన్ రాజు చేతుల మీదుగా యు.సుబ్బారావు బెస్ట్ ఫెర్మార్మెన్స్ అవార్డ్ అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం సంఘ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండి రెడ్డి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులు సుబ్బారావును సత్కరించారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం డివిజన్ ప్రధాన కార్యదర్శి బాలిన సత్యనారాయణ, ప్రసాద్, అశోక్, రమేష్, శ్రీనివాసరావు, కిరణ్, రాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దండు గంగానమ్మ విగ్రహ ప్రతిష్ఠ

కొయ్యలగూడెం: కనకాద్రిపురంలో నిర్వహించనున్న దండు గంగానమ్మ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. సెప్టెంబర్ 2వ తేదీ వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. రెండవ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. శనివారం ఉదయం 10:43 గంటలకు అమ్మవారితో సహా ఆమె సోదరుడు పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

సమస్యలపై కలెక్టర్‌కు వినతి


కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద సమస్యలు వింటున్న కలెక్టర్

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏలో ఏర్పాటు చేసిన పాలకవర్గ సమావేశానికి వచ్చిన జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు పలువురు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. బుట్టాయగూడెం మండలం అలివేరు డ్యామ్ కాలనీకి చెందిన గిరిజనులు తమ గ్రామంలో మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. అదేవిధంగా వేలేరుపాడు మండలంకు చెందిన నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఐఎంఎల్ ప్రజాపందా నాయకులు గౌసు ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. పోడు భూములకు పట్టాలివ్వాలని, పెద్దవాగు ప్రాజెక్టు కాల్వ మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు. అలాగే గత ఏడాది గోదావరి వరదలకు నష్టపోయిన వారికి పరిహారం ఇవ్వాలని కోరారు. వీటితోపాటు పలువురు సమస్యలపై వినతిపత్రాలను కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజలకు అందజేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని విన్నపం

సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బాలరాజు హామీ


ఎమ్మెల్యే బాలరాజుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: తమ సమస్యలను పరిష్కరించాలని గృహ నిర్మాణ శాఖలో పని చేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, యూనియన్ నాయకులు ఎమ్మెల్యే బాలరాజుకు మొరపెట్టుకున్నారు. దుద్దుకూరులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు ఎమ్మెల్యే బాలరాజును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. తాము 2007 నుంచి గృహ నిర్మాణ శాఖలో పని చేస్తున్నా ఉద్యోగ భద్రత లేదన్నారు. తమ శాఖలో ఉద్యోగులు రిటైర్ అవుతున్నారని, ఆ ఖాళీ పోస్టుల్లో తమను రెగ్యులర్ ఉద్యోగులుగా నియమించాలని కోరారు. దీనిపై బాలరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. యూనియన్ నాయకులు సాయికృష్ణ, గుమ్మళ్ల నాగయ్య, ఏ.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక ఛత్రపతి శివాజీ త్రి శత జంతి ప్రభుత్వ కళాశాలలో బుధవారం పుస్తక పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.ఎన్.ప్రసాద్ బాబు అధ్యక్షతన ఏలూరు లయన్స్ క్లబ్, ట్రేస్ ఇండియా ప్రెసిడెంట్ ఏంజిలో ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తక పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎస్‌వీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఏలూరు లయన్స్ క్లబ్, ట్రేస్ ఇండియా తరపున ఏటా దాదాపు 30 వేల పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ట్రేస్ ఇండియా ప్రెసిడెంట్ ఏంజిలో విద్యార్థునుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ట్రెజరర్ శివకుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యువగళం.. గందరగోళం

- రైతు సమస్యలపై లోకేష్‌కు అవగాహన లేదు
- వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వాసిరెడ్డి మధు విమర్శ


పార్టీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వాసిరెడ్డి మధు

టి.నరసాపురం: రైతు సమస్యలపై పూర్తిగా అవగాహన లేని టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించడం తగదని వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వాసిరెడ్డి మధు అన్నారు. కె.జగ్గవరం సహకార సంఘం వద్ద బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో జరుగుతున్న యువగళం పాదయాత్ర గందరగోళంగా ఉందన్నారు. లోకేష్ పామాయిల్ రైతులతో మాట్లాడుతూ సైకో పోతేనే పామాయిల్ రైతులు బాగుంటారని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వ్యవసాయం దండగ అని చంద్రబాబు అంటే వ్యవసాయాన్ని పండుగ చేసింది దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని గుర్తు చేశారు. అవగాహన లేకుండా విమర్శలు చేయడం తగదని, వాస్తవాలు తెలుసుకోవాలని అన్నారు. చంద్రబాబు హయాంలో తెలంగాణకు, ఆంధ్రాకు పామాయిల్ రైతులకు చెల్లించే ధరలో టన్నుకు రూ.3 వేలు నుంచి రూ.4 వేలు వ్యత్యాసం ఉండేదని గుర్తు చేశారు. తెలంగాణాలో 16.7 శాతం ఓఈఆర్ ప్రకారం రైతుకు ధర చెల్లిస్తే ఆంధ్రాలో 14.5 ప్రకారమే చెల్లించేవారన్నారు. ప్రజాసంకల్ప యాత్రలో జగన్‌మోహన్‌రెడ్డికి పామాయిల్ రైతులు ఓఈఆర్ వ్యత్యాసం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని, రైతు ప్రతినిధిగా తాను వివరించానని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక కొఠారి రామచంద్రరావును ఓఈఆర్ ఫెడరేషన్ కమిటీ ఛైర్మన్‌గా నియమించారని, ఆ కమిటీ సూచన మేరకు 19.32 ఓఈఆర్ ప్రకారం తెలంగాణాతో సమానంగా ఆంధ్రాలో రైతులకు పామాయిల్ రేటు చెల్లిస్తున్నారని వివరించారు. అప్పట్లో తెలంగాణాకు , ఆంధ్రాకు వ్యత్యాసం ఉన్న పాతబాకీ రూ. 95 కోట్లను జగన్‌మోహన్‌రెడ్డి పామాయిల్ రైతులకు చెల్లించారని, ఇది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వైఎస్సార్ ఉచిత విద్యుత్ ఇవ్వడం వల్లే రైతులకు పంటలు గిట్టుబాటు అవుతున్నాయన్నారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని 20ఏళ్ల క్రితం రైతులు ఉద్యమిస్తే బషీరాబాగ్‌లో రైతులను గుర్రాలతో తొక్కించి కాల్చి చంపింది చంద్రబాబేనని గుర్తు చేశారు. విద్యుత్ షాక్‌తో మృతిచెందిన కుటుంబానికి జగనన్న బీమా ద్వారా రూ. 5లక్షలు చెల్లించడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. పామాయిల్ సమస్యలపై ప్రస్తుత ఎంపీ కోటగిరి శ్రీధర్ పార్లమెంట్‌లో పలు సార్లు ప్రస్తావించారని, టీడీపీ ఎంపీలు ఎన్నిసార్లు మాట్లాడారని రికార్డులు పరిశీలించుకోవాలన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి జాతికి అంకితం చేసేది జగన్‌మోహన్‌రెడ్డే అని, ఆర్‌అండ్ఆర్ బాధితులకు పూర్తి న్యాయం చేసేది జగనే అన్నారు. నిర్వాసితుల ముఖాముఖిలో సమస్యలపై అవగాహన లేదని చెప్పిన లోకేష్ వారికి ఏం న్యాయం చేయగలరని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే గెలుపని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

రక్తదానం పట్ల అపోహలు విడనాడాలి


శిబిరంలో రక్తదానం చేస్తున్న దాతలు

కామవరపుకోట: రక్తదానం చేయడంలో అపోహలు విడనాడాలని పీవీఎస్ ఫౌండేషన్ సభ్యులు పాలడుగు వెంకట సురేష్ అన్నారు. ప్రపంచ రికార్డు రక్తదాత డాక్టర్ సంపత్ కుమార్ జన్మదిన సందర్భంగా, బుధవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్తాన్ని స్వీకరించి, రక్తదాతలకు పండ్లు, కూల్‌డ్రింక్స్ ఇవ్వటంతో పాటు రక్తదాత ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పీవీఎస్ ఫౌండేషన్ సభ్యులు సురేష్ మాట్లాడుతూ రక్తదానం పట్ల అపోహలు తొలగించుకుని, పట్టణాలకు దీటుగా పల్లెల్లో సైతం రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు వీరమల్ల మధు మాట్లాడుతూ యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు జయవరపు ప్రసాద్, పూర్ణచంద్రరావు, నంబూరు ప్రసాద్, కంభంపాటి రత్నకుమారి, గుడిమెట్ల వెంకటలక్ష్మి, చవ్వా రాంబాబు, కర్పూరం కృష్ణమూర్తి, వందనపు మురళి, కొండూరు రామకృష్ణ, పత్తి కుమార్, వాసా వాసు, నల్లూరి ప్రభాకర్, కొండూరు శ్రీధర్, బచ్చు ముత్యాలరావు, సహాయ ఫౌండేషన్ సభ్యులు తమ్మిశెట్టి సత్యనారాయణ, గోరికల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్


పోలవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖర్లు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం సబ్‌రిజిస్ట్రార్ పరిధిలోని దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్‌లు, కంప్యూటర్ ఆపరేటర్‌లు బుధవారం పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ నూతనంగా ప్రవేశపెడుతున్న ప్రైమ్ 2.0 విధానం వల్ల ప్రజలు, లేఖర్లు ఇబ్బందులు పడే అవకాశం ఉందని, దీనిని నిరసిస్తూ రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం పిలుపు మేరకు 30, 31 తేదీలలో రెండు రోజుల పాటు పెన్‌డౌన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా బుధవారం పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖర్లు, వారి సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్‌లు, స్టాంప్ వెండర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం రూరల్: రిజిస్ట్రేషన్ శాఖలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన ప్రైమ్ 2.0 విధానానికి నిరసనగా పోలవరం పరిధిలోని దస్తావేజు లేఖర్లు, సహాయకులు బుధవారం పోలవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించారు. దస్తావేజు లేఖర్లు మాట్లాడుతూ కక్షిదారులు దీని వల్ల ఎదుర్కోబోయే సమస్యలు గురించి తెలియజేసి గురువారం కూడా పెన్ డౌన్ నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సారిక శివకుమార్, కాకుర్తి హరినాథరావు, పెండ్యాల రమేష్, పెరుమాళ్ల గోవిందరావు, నందమూరి మహేష్, కారంకి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


కొయ్యలగూడెంలో సీసీ రోడ్డు పనులకు ప్రారంభ పూజలు నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం పరిధిలో పలు అభివృద్ధి పనులకు బుధవారం శ్రీకారం చుట్టినట్లు వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్, ఉపసర్పంచ్ శంకు కొండ పేర్కొన్నారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు విడుదల చేసిన గడపగడప నిధులలో భాగంగా సుమారు ఐదువందల మీటర్ల సీసీ రోడ్లను రూ.20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఒకటవ సచివాలయం పరిధిలో ప్రారంభ పూజలు నిర్వహించారు. వడ్డీల పేట, చేపల పేట నుంచి మెయిన్ రోడ్డు కలిసే రోడ్డు, టేకు తోట, అశోక్ నగర్ ఇలా పలుచోట్ల నిర్మాణ పనుల పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో ఎంపీపీ గంజిమాల రామారావు, మాజీ ఎంపీపీ మట్ట సత్తిపండు, ఎంపీటీసీ గంట శీను, పంచాయతీ వార్డ్ నెంబర్లు పూలపల్లి రవికుమార్, బుసి త్రిమూర్తులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గంటసాల సాయి, చిటికె నాగార్జున, మడుతూరి శీను, తదితరులు పాల్గొన్నారు.

రైతును బెదిరించిన ఇద్దరిపై కేసు నమోదు

ద్వారకాతిరుమల: అక్రమంగా ఒక పొలంలోకి ప్రవేశించి, దాని ఫెన్సింగ్‌ను ధ్వంసం చేయడంతో పాటు సంబంధిత రైతును బెదిరించిన ముగ్గురు వ్యక్తులపై ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు తెలిపిన కథనం ప్రకారం. మండలంలోని దొరసానిపాడు గ్రామానికి చెందిన వడ్లమూడి మురళీకృష్ణకు కొమ్మర గ్రామంలో 2.13 ఎకరాల పొలం ఉంది. అయితే ఇదే గ్రామానికి చెందిన చవల లక్ష్మణ్, చవల అంజి ఈనెల 13న రాత్రి మురళీకృష్ణ పొలంలోకి అక్రమంగా ప్రవేశించి, ఫెన్సింగ్ స్తంభాలను విరగ్గొట్టారు. ఇదేంటని వారిని అడుగగా తనను చంపుతానని లక్ష్మణ్, అంజిలు బెదిరించారని మురళీకృష్ణ ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ దుర్గారావు తెలిపారు.

ఇంగ్లిష్ లెక్చరర్ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పోలవరం రూరల్: పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఆంగ్ల అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఇంటర్మీడియెట్ బోర్డు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అతిథి అధ్యాపక విధానంలో ఖాళీగా ఉన్న ఇంగ్లిష్ లెక్చరర్ పోస్టు భర్తీ చేయడం జరుగుతుందన్నారు. పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, సంబంధిత సబ్జెక్ట్‌లో కనీసం 50 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. అర్హత కలిగిన విశ్రాంత ఉద్యోగులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నిబంధనల ప్రకారం ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థికి ప్రభుత్వం నిర్ణయించిన గౌరవవేతనం ఇవ్వడం జరుగుతుందన్నారు. దరఖాస్తులు సెప్టెంబర్ 4వ తేదీ లోగా కళాశాల కార్యాలయంలో అందించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

ద్వారకాతిరుమల: కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న ఇద్దరిపై బుధవారం కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం. నిడమర్రు మండలం తోకలపల్లికి చెందిన బలే వెంకట సుబ్బరాజు సూచనల మేరకు, కృష్ణాజిల్లా, మండవల్లి మండలం నుచ్చుమిల్లి గ్రామానికి చెందిన ఘంటసాల సుదర్శన్ తన మినీ ఐషర్ వ్యాన్‌లో కోళ్ల వ్యర్థాలను బుధవారం సాయంత్రం తోకలపల్లికి తరలిస్తున్నాడు. ద్వారకాతిరుమల మండలం గుణ్ణంపల్లి బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు సదరు వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో కోళ్ల వ్యర్థాలు ఉన్నట్టు గుర్తించి, వ్యాన్‌ను, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రజారోగ్యానికి భంగం కలిగేలా కోళ్ల వ్యర్థాలను అక్రమంగా రవాణా చేస్తున్న యజమాని వెంకట సుబ్బరాజు, డ్రైవర్ సుదర్శన్‌లపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ దుర్గారావు తెలిపారు.

ఆంగ్ల బోధనలో నైపుణ్యం తప్పనిసరి


రాజానగరంలో పాఠశాలను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఈఓ

బుట్టాయగూడెం : గిరిజన విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించే విధంగా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.శ్యామ్ సుందర్ అన్నారు. రాజానగరం గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ లెవెల్ శిక్షణ కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల్లో, ఇంగ్లిష్ మీడియం విద్యాబోధన ప్రవేశపెట్టిన నేపద్యంలో ఉపాధ్యాయులు ఇంగ్లిష్ బోధనపై నైపుణ్యం సాధించాలని అన్నారు. అలాగే విద్యాబోధనలో మెలకువలు నేర్చుకోవాలని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులకు అందించే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఉప విద్యాశాఖాధికారి బుద్దుల రాముడు, ఎంఈఓ తెల్లం బాబూరావు, ఎంఈఓ-2 సీహెచ్ నరేంద్ర రాయ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వంట సామగ్రి అందజేత


హెచ్‌ఎం దేవానందరావుకు వంట సామగ్రిని అందజేస్తున్న దాతలు

ద్వారకాతిరుమల: మండలంలోని దేవినేనివారిగూడెంలో మండల పరిషత్ పాఠశాల-1 కు కావాల్సిన వంట సామగ్రిని రామన్నగూడెం గ్రామానికి చెందిన పాకలపాటి సోమయ్య కుమారులు సమకూర్చారు. వాటిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గెడ్డం దేవానందరావుకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సోమయ్య కుమారుడు, రామన్నగూడెం మాజీ గ్రామ సర్పంచ్ పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు మాట్లాడుతూ తామంతా ఇదే పాఠశాలలో చదువుకున్నామని, అందుకే పాఠశాలపై అభిమానంతో ఈ సామగ్రిని అందించినట్టు చెప్పారు. విద్యార్థులు బాగా చదివి అభివృద్ధిలోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సోమయ్య కుమారులు పాకలపాటి సుబ్రహ్మణ్యం, భాస్కరరావు, శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాళ్ల సాగర్‌బాబుకు అభినందనలు


సాగర్‌బాబును అభినందిస్తున్న అలుగు ఆనందశేఖర్ తదితరులు

జంగారెడ్డిగూడెం: భారత జాతీయ స్థాయి సివిల్ సర్వీస్ పరీక్షల్లో విజయం సాధించి తమిళనాడు రాష్ట్రం పాండిచ్చేరి క్యాడర్లో పోస్టింగ్ సాధించిన జంగారెడ్డిగూడెం ప్రాంతానికి చెందిన ఏళ్ల సాగర్ బాబును విద్యావేత్త డాక్టర్ ఆలుగు ఆనంద్ శేఖర్ అభినందించారు. బుధవారం స్థానిక ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో దళిత గిరిజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో యాళ్ల సాగర్ బాబును భారీ ఎత్తున సన్మానించారు. ఈ సభకు డాక్టర్లు ఆనంద్ శేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సాగర్ బాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంలో అధికారిని ఆయిన అనంతరం ఈ ప్రాంత అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మానుకొండ కిషోర్, నాటకశాల వెంకటరాజు, ప్రముఖ న్యాయవాది గర్నికూటి రాంబాబు, కోడేటి సత్యనారాయణ, సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

టి.నరసాపురం: టి.నరసాపురం 132/33కేవీ సబ్‌స్టేషన్ నుంచి తిరుమలదేవిపేటకు నూతన లైన్ల అనుసంధాన ప్రక్రియ కొనసాగుతున్నందున గురువారం తిరుమలదేవిపేట సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జంగారెడ్డిగూడెం విద్యుత్ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

తోబుట్టువుల అనుబంధాన్ని చాటేది రక్షాబంధన్

బుట్టాయగూడెం: సమాజంలో అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధాన్ని చాటేది రక్షా బంధన్ అని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు వైఎస్సార్ సీపీ మహిళా ప్రజాప్రతినిధులు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ప్రేమాభిమానాలు చూపిస్తున్న మహిళా ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఒక అన్నగా, ఒక తమ్ముడిగా వారికి ఎప్పుడూ అండగా ఉంటానని చెప్పారు. బాలరాజుకు రాఖీ కట్టిన వారిలో ఎంపీపీ కారం శాంతిరమణ, జెడ్పీటీసీలు దాసరి శ్రీలక్ష్మి, బుజ్జి రామలక్ష్మి, ఎంపీపీలు వల్లా లక్ష్మీదేవి, డి.లక్ష్మి, సర్పంచ్‌లు, ఎం.రామలక్ష్మి, తెల్లం వెంకాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: ఎటువంటి కాలంలోనైనా తోబుట్టుకు ఎల్లవేళలా తోడుంటాని సోదరుడు ఇచ్చే భరోసాయే రక్షాబంధన్ అని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థినులు ఎమ్మెల్యే ఎలీజాకు రాఖీ కట్టి స్వీట్ తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని ఆశీర్వదిస్తూ విద్యలో ఉన్నతంగా రాణించాలని సూచించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన నిత్యం రక్షా బంధనాన్ని తలపిస్తోందని, ఆయన పాలనలో ప్రతీ ఒక్క విద్యార్థినికి పూర్తి స్థాయి రక్షణ ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను విద్యార్థులు ఒడిసి పట్టుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్, తహసీల్దార్ స్లీవజోజి, ట్రాఫిక్ సిబ్బందిని కలిసి విద్యార్థినులు రాఖీలు కట్టారు.

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన అనిల్‌కుమార్ గౌడ్

జంగారెడ్డిగూడెం: గౌడ సామాజిక వర్గానికి సముచిత స్థానం కల్పిస్తూ వారి అభివృద్ధికి సహకరిస్తున్నందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఏలూరు జిల్లా గౌడ సంఘం యూత్ అధ్యక్షుడు చింత అనిల్‌కుమార్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం జగ్గంపేటలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కుమార్తె వివాహానికి హాజరైన సీఎం వైఎస్ జగన్‌ను అనిల్‌కుమార్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. గౌడ సామాజిక వర్గం నుంచి టీటీడీ దేవస్థానం బోర్డులో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు మేకా శేషుబాబుకు డైరెక్టర్ పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలి

లింగపాలెం : వర్షాకాలం సీజన్ కావటంతో గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీఓ ఎస్.ఆశీర్వాదం కార్యదర్శులకు ఆదేశించారు. బుధవారం ధర్మాజీగూడెంలో పారిశుధ్యం పనులు, డ్రెయినేజీలు, పైపులైన్లను ఎంపీడీఓ ఆశీర్వాదం, ఈవోపీఆర్డీ రత్నకుమార్ పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామాల్లో విషజ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని కలుషితమైన నీరు రాకుండా, పైపులైన్లు లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు కార్యదర్శులను ఆదేశించారు. డ్రెయినేజీలు శుభ్రపర్చాలని, దోమల మందును వీధుల్లో స్ప్రే చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, కార్యదర్శి హరికృష్ణ ఉన్నారు.